బాక్సర్ రెహమాన్

- చిన్నతనంలోనే బాక్సింగ్‌లో ప్రతిభ చాటుతున్న ఫసీ ఉర్ రహమాన్
- హరియాణాలో జరిగిన పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి ఆశ్చర్య పరిచిన బాలుడు


గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్‌తో ఫసీ ఉర్ రహమాన్

ఓల్డ్ బోయిన్‌పల్లి: చిన్నతనంలోనే బాక్సింగ్ కావాలనే లక్ష్యంతో ఉన్న 9వ తరగతి చదువుతున్న ఫసీ ఉర్ రహమాన్ కలను గుర్తించిన తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో రెండు గోల్డ్ మెడల్స్ సాధించి ఔరా అనిపించాడు. ఇంట్లో స్పోర్ట్స్ చానళ్లలో బాక్సింగ్ చూస్తూ... ప్రాక్టీస్ చేస్తున్న రహమాన్‌ను తండ్రి ముజీబ్ ఉర్ రహమాన్ గమనించారు. వెంటనే బాలానగర్‌కు చెందిన బాక్సింగ్ కోచ్ మహమ్మద్ అఫ్రోజ్‌ను నియమించుకుని ఇంటి దగ్గరనే బాక్సింగ్‌లో కోచింగ్ ఇప్పించాడు. 18 నెలల్లోను ఫసీ ఉర్ రహమాన్ బాక్సర్‌గా తయారు అయ్యాడు. అతని కృషి పట్టుదలతో రాష్ట్ర స్థాయిలో రోతక్ హరియాణాలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించి అందరినీ ఆశ్చర్య పరిచాడు. ఇటీవలి కాలంలో బెంగుళూర్‌లోని జయప్రకాశ్ స్టేడియంలో ఫస్ట్ నైన్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని మరోసారి అసాధారణ ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించి స్కూల్‌లో స్థానికులతో శభాష్ అనిపించుకున్నాడు. ప్రస్తుతం హరియాణాలో ఏప్రిల్‌లో జరిగే ఇంటర్నేషనల్ బాక్సింగ్ పోటీలలో పాల్గొనేందుకు ప్రాక్టీస్ చేస్తున్నాడని తన తండ్రి తెలిపారు.

పచ్చదనంతో ప్రాంగణాలు.. సందేశాలిచ్చే గోడలు

- ఆదర్శంగా నిలుస్తున్న కేంద్రీయ విద్యాలయ
- స్వచ్ఛతకు ప్రాధాన్యంతో మరింత ముందడుగు..


ప్రధాన గేటు వద్ద గోడకు విద్యార్థులు వేసిన వాల్ పెయింటింగ్

రాయదుర్గం: స్వచ్ఛతతో ముందడుగు వేస్తూ. పచ్చదనంతో కళకళలాడుతూ, సందేశమిచ్చేలా గోడలపై రాతలతో, దేశం గర్వించదగ్గ నేతల చిత్రాలతో జాతీయ భావన విద్యార్థులలో నెలకొనేలా చేస్తోంది. గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయ. కేంద్ర ప్రభుత్వం వివిధ కేంద్రీయ సంస్థలలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, కొంత మంది స్థానికులకు కూడా విద్యావకాశాలు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యతతో కూడిన విద్యను అందించేందుకు ఈ కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల భాగస్వామ్యంతో విద్యాలయ పరిసరాలను ఆకట్టుకునేలా, ఆదర్శప్రాయంగా ఉండేలా అందంగా తీర్చిదిద్దారు. సమష్టి కృషితో వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ నాయకత్వంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యాలయాన్ని మరింత ఆదర్శంగా మారుస్తున్నారు.

ఐదు ఎకరాలలో..

గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో 1987లో కేంద్ర ప్రభుత్వం ఐదు ఎకరాల్లో కేంద్రీయ విద్యాలయను ప్రారంభించింది. ఇక్కడ నీడనిచ్చే భారీ వృక్షాలు, రకరకాల పూలు, పచ్చదనంతో కూడిన మొక్కలతో కళకళలాడుతుంటుంది. పాఠశాల ప్రధాన గేటు నుంచి లోపలి వస్తుంటేనే పచ్చదనం ప్రాధాన్యత, రకరకాల పూలమొక్కలు, గ్రీనరీ ఆకట్టుకుంటుంది. పరిసరాల్లోని ఇతర చోట్లలో భారీ వృక్షాలు అందరినీ ఆహ్లాద పరిచేలా కనిపిస్తాయి.గోడలన్నీ సందేశాన్నిచ్చే, ఆలోచింపచేసే రాతలు, జాతీయ నేతల చిత్రాలతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.

సమష్టిగా ముందుకు..

విద్యాలయలోని ఆర్ట్ విభాగం వారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సమష్టిగా రంగురంగుల బొమ్మలు, జాతీయ నేతల చిత్రపటాలు, ఇతర రకాల సందేశాలిస్తూ వ్రాతలు, పరిసరాల్లోని సహజ సిద్ధంగా ఏర్పడిన రాతికి రంగులద్దడం, నేలపై రంగోలితో ఆకట్టుకునేలా చేశారుమహాత్ములు, ఆరోగ్య చిట్కాలు, ఆధ్యాత్మిక సందేశాలు తదితర సందేశాలిచ్చే రాతలతో ప్రాంగణమంతా ఆకట్టుకుంటుంది. విద్యార్థులకు సులభంగా స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, మొక్కలు నాటించడం, పరిసరాల్లో రంగోలీలు, గోడలకు చిత్రాలు వేయించడంలోనూ సమష్టి కృషి కనిపిస్తుంది. ప్రతియేటా స్వచ్ఛపక్వాడా కార్యక్రమంలో అందరూ భాగస్వాములవుతూ జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని వారిని కూడా పాటించేలా ర్యాలీలు నిర్వహిస్తూ, నినాదాలు చేస్తూ, ప్లకార్డులు చేతపట్టి అవగాహన కల్పించడం విశేషం.



గోడలపై చిత్రాలు గీయడంలో నిమగ్నమైన విద్యార్థులు


పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములై..

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

సీఐటీయూ నాయకుడు ఐలాపురం రాజశేఖర్

బాలానగర్: తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ డిమాండ్ చేశారు. బాలానగర్ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పెండింగ్ జీతాలు, స్కూల్ అద్దెలు, గ్యాస్ బిల్లులు, కూరగాయల బిల్లులు వెంటనే చెల్లించాలని సీడీపీఓ కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్ శ్రీకాంత్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లుకు, ఆయాలకు జీతాలు 3 నెలలుగా ఇవ్వకపోవటం బాధాకరమన్నారు. అదే విధంగా ఇతర ఖర్చుల ఇవ్వక పోవటంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పెండింగ్‌లో ఉన్న అన్నింటిని చెల్లించాలని లేకుంటే ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఇద్దరు హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు అరుదైన గౌరవం


ప్రొఫెసర్ వీరేష్‌రావల్


ప్రొఫెసర్ అఖిల కుమార్ సాహూ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం కలిగింది. ప్రొఫెసర్లు వీరేష్‌రావల్, అఖిలకుమార్‌సాహుకు ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా చైర్ ప్రొఫెసర్‌షిప్‌లను ప్రదానం చేయడం విశేషం. వీరిద్దరు హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీలో విధులను నిర్వహిస్తున్నారు. న్యూఢిల్లీలో ఉన్న పెనమ్ లేబొరేటరీస్ లిమిటెడ్, బీటా లాక్టమ్ యాంటీబయాటిక్స్, ఏపీఐ ఫార్ములేషన్‌ల భారతదేశ ప్రఖ్యాత నిర్మాతలలో ఒకటి. పెనమ్ లేబొరేటరీస్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పరాస్‌నాథ్‌పాండే హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీలో రెండు చైర్ ప్రొఫెసర్ పోస్టులను ఏర్పాటు చేయడానికి ఒక ఎండోమెంట్ ఫండ్‌ను రూపొందించారు. అందులో ఒకటి ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతి చైర్ ప్రొఫెసర్‌షిప్ స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ రెగ్యులర్ ఫ్యాకల్టీకి నెలకు రూ.25వేలు, సంవత్సరానికి లక్ష వేతనాలతో ఎంపిక చేసిన చైర్ పదవీకాలం గరిష్ఠంగా రెండు ఏళ్లు ఉండేలా ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా రెండవది ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా కెమిస్ట్రీలో అంతర్జాతీయంగా ప్రసిద్ధిచెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు/ప్రొఫెసర్లు విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌గా ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఇలా నియమించబడిన ప్రొఫెసర్‌కు నెలకు లక్ష రూపాయలు పారితోషికం అందిస్తారు. హెచ్‌సీయూ వద్ద గెస్ట్‌హౌజ్ వసతి, వన్‌టైమ్ ఎకానమీ క్లాస్ ఎయిర్‌ట్రావెల్ కూడా చెల్లించబడుతుంది.

తులసీనగర్ అభివృద్ధికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసీనగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిశారు. ఈ సందర్భంగా నూతన కాలనీ సభ్యులను ఎమ్మెల్యే గాంధీ శాలువాతో సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్యవర్గ సభ్యులు కాలనీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఒక ఆదర్శవంతమైన కాలనీలో తీర్చిదిద్దే క్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. తులసీనగర్ కాలనీలో అన్నిరకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ వారి భాగస్వామ్యంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తులసీనగర్ అధ్యక్షుడు చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ట్రెజరర్ శంకర్‌రావు, రామకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయికృప అపార్టుమెంట్ అభివృద్ధికి కృషి చేయాలి

ఆల్విన్‌కాలనీ: మదీనాగూడలోని శ్రీ సాయికృప అపార్టుమెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అపార్టుమెంట్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం సభ్యులను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సురేష్ బాబు, జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, ట్రెజరర్ నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ అజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ రవిచంద్ర, వంశీ కృష్ణ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు బినయ్, హనుమంతరావు, సత్యనారాయణ, బలవంత్‌రెడ్డి, కమిటీ సలహాదారుడు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవం


ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌ను తీసుకొస్తున్న స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దీపికారెడ్డి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లిలోని కృష్ణావేణి టాలెంట్ హైస్కూల్ 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, సైబర్ క్రైం ఏసీపీ డాక్టర్ రాజేష్, గౌరవ అతిథులుగా టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, మక్కాల నర్సింగ్‌రావు, డాక్టర్ సుధాకర్ పాల్గొని జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దీపికారెడ్డి మాట్లాడుతూ.. 15 సంవత్సరాల కాలంలో పాఠశాల సాధించిన విజయాలు, అధిగమించిన మైలురాళ్లను వివరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులుగా తాము తగిన విధంగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్రి యాదగిరి, ఖాదీర్, పోచయ్య, షాయిన్‌షా, చందుయాదవ్, ఉమేష్‌యాదవ్, బాలకృష్ణయాదవ్, మదుసూదన్‌రెడ్డి హేమంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కల్చరల్ ఫెస్ట్.. స్టూడెంట్స్ జోష్


సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ఈటల రాజేందర్

కూకట్‌పల్లి: వివేకానంద డిగ్రీ కాలేజీలో జరుగుతున్న కల్చరల్ ఫెస్టివల్ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను బయటకు తీసింది. సుమారు 30 డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ ఫెస్ట్‌లో మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విచ్చేసి ప్రారంభించారు. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు అలవాటు పడకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కొరదాల నరేష్, డైరెక్టర్ కెవి. లావణ్య, ఆర్గనైజేషన్ డీన్ మౌనిక, ప్రిన్సిపాల్ బిఎస్ రాజేష్, సంఘమిత్ర డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ మీరావళి, వనిత డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్ ప్రిన్సిపాల్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, చైర్మన్ డా. నరేష్, డైరెక్టర్ కేవీ లావణ్య

చెరువులపై సమగ్ర దర్యాప్తు చేయించాలి

మియాపూర్: చెరువులపై సమగ్ర దర్యాప్తు చేయించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధికారులకు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేట్ కిందికుంట చెరువు కబ్జా చేసి భవనాలు నిర్మిస్తున్నారన్నారు. స్థానిక అధికారులు చెరువులు కబ్జాకు గురవుతున్న ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువును సర్వే చేయించి చెరువును కబ్జా చర నుండి విడిపించాలని, కబ్జా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శివసాయిక్షేత్రంలో పూజలు

రాయదుర్గం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ప్రత్యేక పూజలను జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి, విశ్వేశ్వరస్వామికి మహన్యాస పూర్వకరుద్రాభిషేకం వంటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అంతేకాకుండా అన్నపూర్ణాదేవి అమ్మవారికి, కృష్ణుడికి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యస్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

బొడ్రాయిని పూజించడం మన సంప్రదాయం

రాయదుర్గం: బొడ్రాయిని పూజించడం మనందరి సంప్రదాయమని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ రెండవ రోజైన మంగళవారం పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో ప్రతి గ్రామంలో బొడ్రాయిని పూజించే సంప్రదాయం అనాదిగా వస్తున్నదని గుర్తుచేశారు. పూర్వకాలంలో పెద్దలంతా కలిసి ఏర్పాటు చేసిన బొడ్రాయిని ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో కూడా ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. పట్టణీకరణ చెందినా గ్రామీణ సాంప్రదాయాన్ని వదులు కోకుండా ఉండడం ఎంతో అవసరమన్నారు.

బాలుడి అదృశ్యం

హఫీజ్‌పేట్: బాలుడు అదృశ్యమైన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సరితారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..లింగంపల్లి వెంకట్‌రెడ్డి కాలనీకి చెందిన పొన్నం కుమారస్వామి సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు పొన్నం రిత్విక్, పొన్నం స్వాతిక్ ఉన్నారు. చిన్న కుమారుడు పొన్నం స్వాతిక్ (14) లింగంపల్లిలోని నారాయణ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం 5.50 గంటలకు రిత్విక్, సాతివ్‌క్‌లు స్కూల్ నుంచి ఇంటికి వెళ్లారు. అయితే సాయంత్రం 7.18 గంటలకు స్వాతిక్ అమీన్ చికెన్ షాప్‌కు వెళ్లి 7.30 గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరికి చెప్పకుండా 7.35 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంత వరకు బాలుడు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు అతని కోసం చుట్టు పక్కల, బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకీ కోసం వెతికారు. ఎక్కడ లేకపోవడంతో మంగళవారం ఉదయం చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాస్థాయి సైన్స్ ప్రతిభా పరీక్ష


ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ఈఆర్‌టీ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి సైన్స్ ప్రతిభా పరీక్ష, ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్, తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ప్రతిభా పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన టాలెంట్ టెస్టులో జిల్లా పరిషత్ బోడుప్పల్‌కు చెందిన పి. అక్షయ్‌కుమార్ మొదటి స్థానం, జెడ్పీహెచ్ఎస్ హైదర్‌నగర్‌కు చెందిన జి. శివచరణ్‌కు ద్వితీయ స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శంషీగూడకు చెందిన కె. హంపిత్ కృష్ణలు తృతీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో జరిగే హస్ టాలెంట్ టెస్ట్‌కి ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎంఓ చలువగాలి రవీందర్ రాజు, ఎంఈఓ ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయులు గురచారి, ఫిజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఠాకూర్ అజయ్‌సింగ్, కోశాధికారి తిరుమల శ్రీనివాసాచారి, జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యే గాంధీకి లేదు

బాషిపాక యాదగిరి

ఆల్విన్‌కాలనీ: ప్రజా సమస్యలను ఏనాడు పట్టించుకోని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వివేకానందనగర్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి మంగళవారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గాంధీ గతంలో తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి నేడు బీఆర్ఎస్ నుంచి ఏ పార్టీలోకి వెళ్లామని దిక్కులు చూస్తున్న ఆయనకు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే అర్హత లేదని తెలిపారు. ఇంకొక్కసారి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల గురించి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. వెంటనే ఎమ్మెల్యే గాంధీ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వైభవంగా దేవాలయాల వార్షికోత్సవాలు


పాపిరెడ్డినగర్‌లోని వీరాంజనేయ శివాలయ పూజలో పాల్గొన్న వెంకటేశ్వరరావు, చంద్రారెడ్డి


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని శ్రీవీరాంజనేయ శివాలయం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ ఈస్ట్ కాలనీలోని సాయిబాబా దేవాలయాల వార్షికోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చిన స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ఏదైనా సాధించవచ్చు..

మోతీనగర్: ఆధ్యాత్మిక చింతనతోనే ఏదైనా సాధించవచ్చని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం కార్యనిర్వాహణాధికారి జీఏకే కృష్ణ, చైర్మన్ వీఎస్‌వీ సత్యనారాయణలు పేర్కొన్నారు. మూసాపేట డివిజన్ పాండురంగానగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవం వైభవంగా జరిగాయి. ప్రధాన అర్చకులు కొండపాక వెంకటాచార్యుల పర్యవేక్షణలో రెండు రోజుల నుంచి కొనసాగిన ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారంతో ఘనంగా ముగిసాయి.

ఐకమత్యమే సమస్యలకు పరిష్కారం

పంజగుట్ట: క్రైస్తవులు ఐకమత్యంగా సమన్వయంతో తమ సమస్యలు పరిష్కరించుకోవాలని రాష్ట్ర మాజీ డీజీపీ స్వర్ణజిత్ సేన్ అన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గ్లోబల్ అలయన్స్ ఆఫ్ క్రిస్టియన్ లీడర్స్, క్రిస్టియన్ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వర్ణజిత్ మాట్లాడుతూ.. క్రైస్తవులపై దాడులు జరిగితే తక్షణమే స్పందించేలా స్పెషల్ ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రిస్టియన్ జేఏసీ ప్రతినిధి జెరూసలేం మత్తయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రైస్తవులపై దాడులు తగ్గుతాయనుకుంటే ఇంకా పెరిగాయని ఆరోపించారు. జన్వాడలో చర్చిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

పంజగుట్ట: దేశంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా 70 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని అలాంటి రైతులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్య్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా రైతుల ఆత్మహత్యలు ఆగకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 'రైతు సోదరులు ఆత్మహత్య పరిష్కారం కాదు.. పోరాడి హక్కులను సాధించు' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు ఇంద్రసేన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పదేళ్లలో ప్రధాని మోదీ పాలనలో వేలాదిమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. 2014 తర్వాత రైతుల ఆత్మహత్యలపై కేంద్ర ప్రభుత్వం కనీసం ప్రకటనలు కూడా విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రొఫెసర్ పద్మజా షా, నైనాల గోవర్ధన్, రవీందర్, అంబు రాథోడ్, కరుణాకర్ దేశాయ్ మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు పదవుల్లో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోరన్నారు. అయితే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం రైతులపై ఎంతో ప్రేమ కురిపిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల సమగ్ర నియమావళిపై లేఖ

పంజగుట్ట: రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేలా నైతిక ప్రవర్తనా నియమావళి అమలు చెయ్యాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఫోరం ఫర్ డెమోక్రసీ అండ్ గ్లోబల్ పీస్ సంస్థ కోరింది. అన్ని రాజకీయ ప్రచారాల కోసం ప్రస్తుత మోడల్ ప్రవర్తనా నియమావళిని సమగ్రంగా రూపొందించాలని కోరుతూ రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫోరం ఆధ్వర్యంలో లేఖ రాసినట్టు వారు పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం అధ్యక్షుడు శ్యామ్‌మోహన్, ఉపాధ్యక్షుడు కమలాకర్‌రావు, సెక్రటరీ శ్రావణ్, చరిత్రకారులు డాక్టర్ కొల్లూరి చిరంజీవి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ద్వేషపూరిత ప్రసంగాలు, వ్యక్తిని కించపరిచేలా మాట్లాడటాన్ని కట్టడి చెయ్యాలన్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు నగదు, బహుమతులు పంపిణీ అడ్డుకోవాలన్నారు. ప్రజాస్వామ్య విలువలు నిలబెట్టడంలో భారత ఎన్నికల సంఘానిది కీలకపాత్ర అని.. ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్ని ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తాం

లిబర్టీ: రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు స్థానాలకు పోటీ చేస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ వెల్లడించారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయ శక్తి తామే అన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతామని స్పష్టం చేశారు ఎస్సీ రిజర్వుడ్ స్థానాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. రాష్ట్రంలోని దళిత బహుజనుల ప్రజా సమస్యల పరిష్కరించడంలో ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయని ఆరోపించారు. సమావేశంలో నక్క దేవేందర్, ఇటిక్యాల గణేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయాలని మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌కు కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చందానగర్ డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనుల కోసం నిధులను విడుదల చేయాలని, అమీన్‌పూర్‌కు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందన్నారు. జవహర్‌నగర్, విద్యానగర్, కైలాస్‌నగర్ కాలనీలకు చెందిన స్థానికులు ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. పీజేఆర్ స్టేడియంలో పలు క్రీడలకు కోచ్‌లను నియమించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా స్టేడియంను అభివృద్ధి చేయాలని కమిషనర్‌ను కోరామన్నారు.